

# దేవుడి పల్లకీ

కామరూపు లైన దేవతలూ పరకాయ ప్రవేశం తెలిసిన మనుష్యులూ పుష్కలంగా ఉన్న మంచి కాశీమజిలీ కథలోని మనోహర దృశ్యాలను కళ్లకు కట్టించినట్టు సన్నాయిలోని మలయమారుతం అలా ఎక్కడికెక్కడికో తెలియని దూరతీరాలకు తీసుక వెళ్ళిపోతోంది. కథ చివర్ని మాంచి బిగింపుఉన్న ముగింపులా మద్దెల దరువులు ముచ్చటగా వినబడుతున్నాయి. దేవుడు ఊరేగుతున్నాడు. ఇంటింటి ముందూ ఆగుతున్నాడు. ఇంటివాళ్లిచ్చిన కొబ్బరికాయలు. హారతికర్పూరం. ఊదొత్తులూ తీసుకుని ముందుకు సాగుతున్నాడు. ఈ హడావిడికి జగన్నాధం వీధి అరుగుమీదికి వచ్చాడు. అక్కణ్ణుంచే ఆత్మలోంచే దేవుడి కొక్క నమస్కారం చేశాడు.

వీధిమధ్య పల్లకీ ఆపించారు.

'ఒరే జగ్గూ! రారా, ఆ పల్లకీ అట్నించి యిటు దూరదాం .... చాలా పుణ్యంట' అంటూ ఓ కుర్రాడు పరిగెత్తుకుని ఆ యింటి కొచ్చి జగన్నాధం మనవణ్ణి లాక్కెళ్ళాడు. వాళ్ళిద్దరూ ముందుకి దౌడు తీశారు.

పిల్లలిద్దరూ అందరితోపాటు కళ్లుమూసుకుని, అట్నించి యిటు దూరేరు. భక్తి ఎలాటిదో పిల్లలకి తేలీదుగాని అట్నించి యిటు పల్లకీ కిందనుంచి దూరుతూఉంటే ఎంత సరదాగా ఉంటుందో తెలిసింది. మళ్ళీ మళ్ళీ దూరుతూంటే ఎంత ఉత్సాహంగా ఉంటుందో తెలిసింది. పల్లకీ నడుస్తూంటే కూడా దూరి దొంగాటలాంటిది ఆడుకుంటూంటే ఎంత తమాషాగా ఉంటుందో తెలిసింది.

ప్రతి యింట్లో ప్రతి మనసులో ప్రతి క్షణం దొంగాటలాడే కిష్టుడు ఈ సంగతి ఏమాత్రం తెలిసినా పల్లకీదిగి తనని కూడా ఆటలో చేర్చుకోమని మారాం చేశాడేమో తెలియదు. పూజా ప్లస్ అరులు మాత్రం కుర్రాళ్ళను గట్టిగా కోప్పడ్డారు. జగ్గూ వాళ్ళమ్మ వాడి వీపుమీద ఒక్కటి వెయ్యడంతో వాడికి ఆ ఆనందం ఎంత క్షణికమో అర్ధమయింది.

జగన్నాధం వాడ్ని ఒళ్ళో కూచోపెట్టుకుని వోదార్చాడు.

కళ్ళలో చోటులేక చెంపలమీదకు నీళ్ళు కారుతున్నాయి. 'నేను చేసింది తప్పా తాతయ్యా' అని ఆకళ్ళు అడుగుతున్నాయి.

మరింత ముడుచుకుపోయి ఒళ్ళోచేరిన మనవడ్ని మరింత దగ్గిరగా చేర్చుకుని వాడి తలమీద చెయ్యివేసి నిమిరేడు జగన్నాధం. దేవుడు జగన్నాధానికి మరింత దగ్గిరగా రావడం కనిపించింది.

యశోద ఓసారి సరదాకి అన్నదట.

'పధ్నాలుగు భువనాలనూ కడుపులో పెట్టుకున్నాడుట... మళ్ళీ చూస్తే చిన్న కుర్రాడూ అని కిష్టుడ్ని ప్రతీవాళ్లూ పొగుడుతారు....పాపం ఎలా భరిస్తున్నాడో ఎంత గొప్పవాడో అనుకుంటూ...ఇంత బరువైనవాణ్ణి అవలీలగా ఆదేపనిగా చంకనేసుకుంటున్నాను. నన్ను మెచ్చుకున్న తలమాసిన ఒక్కడు కనపడ్డు. ఇంతకీ ప్రాప్తం!'

కాని యశోదకి దక్కనిది ఆ పల్లకీ మోసేవాళ్ళకి లభించింది.

'ప్రతినిత్యం పరమాత్మని పూజించే వాళ్ళదీ అదృష్టమంటే....దేవుణ్ణి మోసే

అవసరాల రామకృష్ణారావు

ఈ మహద్భాగ్యానికి వాళ్ళు ఏ బంగారు పువ్వులపూజ చేశారో'....మళ్ళీ ఎవరో అన్నారు.

'ఆ భుజాలూ ఆ చేతులూ ఏం నోము నోచుకున్నాయో...'

ఆ చివరిమాటకి జగన్నాధం ఒళ్ళు పులకరించింది.

'ఆ భుజాలూ ఆ చేతులూ ఏం నోము నోచుకున్నాయో....'

దేవుడితోకూడా నడుస్తున్న మనిషి చేతిలో కాగడాలాగ సరిగ్గా ఏభై ఏళ్ళ కిందట జగన్నాధం ఆత్మ ఒక్కసారి దేదీప్య మానంగా వెలిగింది.

* * *

జగన్నాధానివి పెద్దకళ్ళు. వాడి మేనత్త కళ్ళు అచ్చుగుద్దినట్టు వాడికి వచ్చాయంటారు. కళ్లేకాదు కళ్ళతోపాటు కరుణరసమూ పుణికి పుచ్చుకున్నాడని మరి కొందరంటారు. చిన్నప్పుడు వాడి పెంపకం అంతా ఆడాళ్ల చేతిమీదే జరిగింది. వాడికి మూడేళ్ళు నిండకుండానే వాళ్ల నాన్నకి నూరేళ్ళు నిండిపోయాయి. అమ్మని కష్టంలో ఆదుకోటానికి వచ్చిన అమ్మమ్మ యిక్కడే వుండిపోయింది. అమ్మమ్మతో, ఎప్పుడూ కూడా ఉండే అమ్మమ్మ చెల్లెలు చిన్నమ్మమ్మ సరేసరి.

ఏ సాయంకాలపు వేళనో కిటికీలో కాళ్లచుట్టూ చేతులు వేసి ఒదిగి కూచుని కిటికీలోంచి బయటకుచూసే జగ్గుబాబు కళ్ల లోకి చూస్తే ఎన్నోదృశ్యాలు గోచరించేవి.

వీధిలోకి వెళ్లడానికే వాడికి రూల్సులేవు. సాయంకాలం ఆడుకునే వాడి 'ఆటలు' వాళ్ల అమ్మమ్మల దగ్గిర సాగవు. ఓసారి స్కూల్నుంచి అలా ప్లేగ్రౌండ్ కెళ్లి చిటికిన వ్రేలికి చిన్న దెబ్బ తగిలించుకు చక్కా వచ్చాడు. ఫుట్‌బాల్ ఆటమీద అమ్మమ్మ నిర్వచనం అచ్చుకా తగింది.

'పనీ పాటూలేని ఇరవై యిద్దరు వెర్రి వెధవలు సాయంకాలం ఓ శ్మశానం లాంటి చోటికి చేరతారు. పెద్దరకం కొబ్బరి బొండాంలాంటిది ఒకటి మధ్య పడేసుకుని కాళ్ళు వాచేదాకా అటూ యిటూ అదేపనిగా తంతూఉంటారు. నాకు ఆశ్చర్యం వేసేది ఇదికాదు. ఇంతటి ఘనపాటి కార్యం రస వత్తర దృశ్యం మరోటి లేదని కొన్నివేల మంది దీన్ని చూడ్డానికి చుట్టూ తగలడతారు. అదెంత సిగ్గులేదో!' వీధిలోకే వెళ్లని జగ్గుకి లోకజ్ఞానం ఎలా కలుగుతుంది?

అందుకనే ఓనాడు—పదిహేనోఏట— రెండోసారి ఫోర్త్ ఫారం చదువుతున్న రోజుల్లో—ఓసారి జగ్గుకి మేష్టారు మనియార్డరు కట్టి రమ్మని ఫారమూ డబ్బూయిచ్చి పంపుతే—ఎలా కట్టాలో, పోస్టాఫీసులో ఎవరికివ్వాలో పాలుపోక స్కూలు కాంపౌండులో నిద్ర గన్నేరు చెట్టుకింద దిగులుగా కూచోవలసి వచ్చింది.

క్లాసు ఎగ్గొట్టి చొక్కాకింద పుస్తకాలు దాచుకుని యింటికి పారిపోతున్న, సుందరం వాడి అవస్థ గ్రహించి—

'ఇంటికెళ్లి మా చిన్నతమ్ముణ్ణి పంపుతాలే.... విచారపడకు' అంటూ నవ్వేడు. నవ్వుతేనేం తమ్ముణ్ణి పంపేడు. చిన్నవాడైతేనేం వాడే మనియార్డరు కట్టి పెట్టేడు.

జగన్నాధానికి ఇందులో అవహేళన అవగాహన కాక పోలేదు. కాని 'వాళ్ల ముగ్గురూ' దాన్ని నిలబడనియ్యలేదు.

'వాళ్ళు దరిద్రప్పీనుగులూ .... గతుండదు కాబట్టి ప్రతీదీ స్వయంగా ఏడుస్తారు. మారాజు బిడ్డవు. వీధిలో కాలెట్టడానికి నీ ఖర్మవేం కాలిందీ?' అంది అమ్మ.

'ఇంకానయం....పిదపకాలం వచ్చి ఇప్పుడయితే యిలా కట్టుబాట్లు తప్పి కాలం తిరగబడింది గనక మనవూ, మను షులవ్,ని మాటాడుతున్నాం గాని ఆరోజుల్లో యిలా సాగనిచ్చేవారా మరి? మీ తాతగార్ని ఇస్కూలు ఫైనలు అయేదాకా ఇంట్లో ఎత్తుకోడానికీ స్కూలు దగ్గిర దింపడానికీ, మళ్ళీ సాయంకాలం ఇస్కూల్లో ఎత్తుకుని యింటిదగ్గిర దింపడానికీ తైనాతుగా యింట్లో జవాన్లుండేవారని మా అత్త గారు చెప్పేవారు!' అంది అమ్మమ్మ.

'ఇందులో యింకోటుంది రాజమ్మోయ్ ....నోట్లోకి నాలుగువేళ్లూ వెళ్లక వాళ్లపిల్లలు సన్నగా పీలగా తలుపుసందునెట్టి నొక్కినట్టు అఘోరిస్తారు. మనవాడు నున్నగా గున్నలా గుజ్జులా ఎదిగేడని వాళ్లఏడుపు. ఇంత దిష్టి తీయించి పారేస్తానుండు' అంది చిన్నమ్మమ్మ. 'వంశం నిలబెట్టే మొలక' అని కుర్రాణ్ణి ముసలాళ్లు ముద్దుగా పెంచేరు. కాని ఏరోజు కారోజు ఆ 'మొలక'కి వీళ్లు పెట్టే దంపుడు బియ్యాలూ, వెన్న మీగడలూ వెగటైపోయాయి. అందుకనే కదలకుండా పాతిపెట్టినా ఆ మొలక మనసులోని చిలక అలా విహారం చేస్తూనే ఉండేది. దోరగా ఉన్న జామపళ్లు కొరకడంతో కూడా దానికి తృప్తికలగలేదు. కదలలేని చిలకలకి ఆహారం తెచ్చిపెట్టాలి...గూడు లేని పిట్టలకి చిన్నచిన్న గూళ్లుకట్టి ఇవ్వాలి. ఇలాంటి ప్రశ్నలకి జవాబు దొరక్క అసలే పెద్దవిగా ఉన్న వాడికళ్లు ఆశ్చర్యంతో మరింత పెద్ద వవడం కనిపించేది.

'అయ్యో అయ్యో ఎన్ని బియ్యం వేశేశాదో....గుంట నాగమ్మ వేస్తే వేశాడు అలా జోలిలోకి ఒంపేసుకోడమేటే... అవ్వ! ఉండు. నీ పని యిలాకాదు పోలీసు వాళ్లని పిలిచి అప్పచెపుతాను. ఈ దుర్మార్గమేమిటో!' ఆ ముష్టిదీ వెళ్లిపోయేది. మరో పనిమీద అమ్మమ్మా మరలిపోయేది.... కాని ఆ దృశ్యమే ఆ కుర్రాడి కళ్లల్లో కాపురం ఉండిపోయేది.

'పాపం....ముష్టిది, ముసిల్ది జబ్బుది ఎవ్వరూ లేద్ది....కళ్లూ కాళ్లూకూడా లేద్ది.... దానికి రెండు గుప్పెళ్లు బియ్యం వేస్తేనేం ....మొన్ననేగా యింట్లో బస్తాడు బియ్యం దంపించుకున్నదీ....

'ఇదిగో రాజమ్మా...ఇంక యీ పిల్లాడితో మా వల్లకాదమ్మా....పెద్దలు ఎలా చెప్పేరో ఏఎ,ని అడక్కుండా అలా భక్తి శ్రద్ధలతో పెరిగేం. మనింట్లో పని

చేసేవాళ్ళు 'వీళ్ళు ఏంచేసుకు తినేస్తున్నారో' అని ఎప్పుడూ చూస్తారని ఇంట్లో ఏం చేసినా వాళ్ళకి పెట్టేవాళ్ళం కాదు. పెట్టలేక కాదు....కాపజాతి పాపజాతీ అన్నారు.... దిష్టితగుల్తే తిరుగులేకుండా మంచం ఎక్కినవాళ్ళు ఎందరేనా ఉన్నారు. నీ సుపుత్రుడు ఎంత ఘనకార్యం చేశాడో చూడు' అంది చిన్నమ్మమ్మ.

మరేం లేదు. ఆ రోజు జగన్నాథం చేసిన పని యిదీ:

అమ్మమ్మ కందిపప్పు పచ్చడి రుబ్బుతోంది.

'అమ్మమ్మా అమ్మమ్మా నాక్కాస్త పెట్టవ్' అని అరిచెయ్యి జాచాడు. ఆవిడ ఆ నలిగీ నలగని పచ్చడి వాడికి కొంచెం పెట్టింది. వాడలాగ కొంచెం కొంచెం నాకుతూ ఇవతలికి వస్తే గదులు తుడుస్తున్న పనిమనిషి చిట్టెమ్మ చీరపట్టుకు వేళ్లాడుతున్న గౌరి చూసి నవ్వింది. దాని నవ్వు వాడికి నచ్చింది. దాని చేతిలోకూడా కొంచెం వేశాడు. 'భలే....భలే....పచ్చడి ఎంత బాగుందో ఇంకొంచెం తేనా?' అన్నాడు వాడు. ఇద్దరు కలసి తింటూంటే మరింత బాగుంది వాడికి.

'ఊరుకోండి బుల్లిబాబుగారూ, అమ్మగారు చూశేనూ' అంది చిట్టెమ్మ. అనుకున్నట్టు ఆవిడ చూడనే చూసిందీ....

ఏం తప్పా....భోజనాల దగ్గిరకూచుంటే విస్తట్లో నారింజకాయ ప్రమాణంలో వాళ్ల పచ్చళ్ళు వేసుకోడం తను చూశాడు. ఇంత పిసరు పచ్చడి దాని చేతిలో వేస్తే తప్పా?

ఈ విధంగా ప్రశ్నించింది వాడి కళ్ళుగాని నోరుకాదు. అందుకనే వాడికెవరూ జవాబు చెప్పలేదేమో.

వాడు సెకండుఫారం చదువుతూండగా వాడికి కలిగిన అనుభవం ఎప్పుడూ మరచిపోలేనిది.


అప్పుడు వాడికి హఠాత్తుగా పెద్ద జ్వరం వచ్చింది. వాళ్ళు ముగ్గురూ పడిన బాధా, చేసిన హడావిడీ యింతా అంతా కాదు. కషాయాలు కాచిపోశారు. నొసటన వీబూధి పెట్టేరు. రక్షరేకులు కట్టేరు. వీటన్నిటిమించి వాడికి అంత జ్వరంలోనూ కొంచెం సేద కలిగించింది. ఎదురింటి సత్యం—వాడితో స్కూల్లో చదివేవాడు వచ్చి ఓ గడీ దగ్గిర కూచోడమే. వాడు ఎలా ఉందనీ ఎవరు వైద్యం చేస్తున్నారనీ, పత్యం తిన్నావా అనీ యిలాంటివి ఒక్కటైనా అడిగేవాడుకాదు వచ్చింది మొదలు వెళ్లే వరకూ కబుర్లు కబుర్లు కబుర్లు ...ఒకటే కబుర్లు స్కూల్లో ఎవరో కొత్త మేష్టరు వచ్చారనీ... వచ్చిన నాడే ఆయన సైకిలు గాలి ఎవరో విప్పేశారనీ....వస్తూంటే దార్లో తనకి అర్ధణాకాసు దొరికిందనీ....ఆ మాట చెబితే నమ్మక వాళ్ళన్నయ్య కొట్టేడనీ....పక్కింటి రాధావాళ్ళూ కొత్తగా రేడియో కొనుక్కున్నారనీ....రెండోనాటికే పాడయిపోయిందనీ.... వాళ్ళింటికి ఎక్కణ్ణుంచో గోధుం రంగు పిల్లి వచ్చిందనీ.... మూడుపిల్లల్ని పెట్టిందనీ....ఇలా ఆకబుర్లకి అంతూ దరీ లేదు. అందులో ఎన్ని నిజమో తెలీదు....అయితేనేం ఆ కబుర్లు విన్నంత సేపూ తనకి ఒళ్లు నొప్పులూ జ్వరమూ తెలిసేది కాదు. ఆ జ్వరంతో సత్యానికీ జగ్గుకీ బాగా దగ్గిరైపోయింది. స్నేహం ఎంత మత్తు కలిగించేదో జగ్గుకి బాగా తెలిసింది. వాడి జ్వరం తగ్గి పత్యం పుచ్చుకున్నాక ప్రతి రోజూ యిద్దరూ కలిసే బడికెళ్ళి వచ్చేవారు.

ఓసారి వరసాగా మూడ్రోజులు సత్యం కనబడలేదు. మూడోనాడుకూడా రాకపోతే ఇదేమా అని జగ్గు వాళ్ళ ఇంట్లోకి వెళ్ళబోతూంటే అమ్మమ్మ అడ్డుబడి చెయ్యట్టుకుని యింట్లోకి లాక్కొచ్చి ఛళ్ళని తలుపేసింది.

'ఒరే, ఇంట్లో పెద్దవాళ్ళం ముగ్గురున్నాం....ఎవర్తోటీ చెప్పకుండా నీ యిష్టం వొచ్చినట్టు బయల్దేరడవేఁ? ఇంకేం పెద్దా పిన్నా మంచీ చెడ్డా లేదూ? నీకేదేనా వస్తే నిన్నుచూసుకు బతుకుతున్న వాళ్ళంమేం ఏవైఁపోవాలీ? అడక్కుండా పెట్టకుండా అమ్మవారున్న యింట్లోకి జొరపడతావా?' జగ్గుకేం బోధపడలేదు. అమ్మనడిగాడు.

'అవును బాబూ, వాళ్ళ సత్యన్నారాయణకి పెద్దమ్మవారు వచ్చిందట. దాన్నే మశూచికం అనికూడా అంటాం. ఇట్టే అంటుకుంటుంది. అలాంటి అంటురోగాలు ఉన్నచోటికి వెళ్లకూడదు.'

జగ్గు గుండెలు దడదడ కొట్టుకున్నాయి. కళ్ళనీళ్ళ పర్యంతమైంది.



'అయితే నేను వెళ్ళి వాణ్ణి చూడకూడదా అమ్మా ?'

'ఎందుకు చూడకూడదూ ? స్నానమైపోయాక తప్పకుండా చూడొచ్చు. అంతదాకా మాత్రం ఆ వైపులకి వెళ్లేవు సుమా, నామీద ఒట్టు. బాగా ఒత్తుగా కూడా వచ్చిందిట....'

ఆ తరవాత వారం పదిరోజులపాటు జగన్నాధం కడుపునిండా అన్నం తిన్నది లేదు....కంటినిండా నిద్రపోయింది లేదు. అన్ని వేళలలోనూ అన్ని ఆలోచనలూ సత్యం చుట్టూ పరిభ్రమించేవి. ఓసారి గది కిటికీ దగ్గిరకెళ్ళి, పోనీ గడపదగ్గరకేనా వెళ్ళి 'సత్యం, ఒరే సత్యం....నేనురా జగన్నాధాన్ని ఇలా చూడూ ..బాగున్నావా? ఎప్పుడు నీకు నీళ్లు పోసేది ? మనిద్దరం జటపటాలు వేసుకుని మళ్ళీ ఎప్పుడ్రా బడికి వెళ్లేది ?' అని అడగా లనిపించేది. అందుకనే అమ్మ ఒట్టుకూడా కాదని సైన్సు మేష్టార్ని అడిగి చూశాడు. 'అవునోయ్ జగన్నాధరావ్....స్మాల్‌పాక్స్ చాలా భయంకరమైన వ్యాధే. మీ అమ్మగారు చెప్పినట్టే చెయ్యి....అదే మంచిది' ఆ ఆశకూడా పోయింది! అలా పైన ఉండే ఆ గుమ్మంలోంచి వచ్చే ప్రతి మనిషినీ 'ఏవండీ, మా సత్యం ఎలా ఉన్నాడు ?. వాణ్ణి వెళ్ళి చూడొచ్చా ?' అని అడిగేవాడు.

కాని జగన్నాధం అలా ఎక్కువరోజులు అడగవలసిన అవసరం లేకపోయింది. పుట్టిన వాళ్ళందరికీ చావు అని చిన్నప్పుడే రుజువుచేశాడు సత్యం.

జగన్నాధానికి తను చేసిన తప్పు చాలా పెద్దదనీ యిక దానికి నిష్కృతిలేదనీ తోచసాగింది. అమ్మగాదు, మేష్టరుకాదు, బ్రహ్మదేవుడు చెప్పనీ జబ్బుగా ఉన్నప్పుడు తను సత్యాన్ని వెళ్ళి చూడలేదనేది మహాపరాధంగా ఎన్నో రోజులు కుమిలిపోయాడు. 'సత్యం, నన్ను క్షమించవూ ?' అని వెక్కి వెక్కి ఏడ్చాడు. సున్నితమైన మనసున్న మానవుణ్ణి శుష్కవిచారం ఎక్కువ బాధిస్తుంది. మొదట ఆశ్చర్యంతో విప్పారిన జగన్నాధం కళ్లు క్రమంగా చేతకాని తనంతో దించుకుపోసాగాయి. చిన్నప్పట్నుంచీకూడా వాడికి కావలసింది అడగడమే తెలీదు. గట్టిగా మాటాడ్డమే తెలీదు.. ఎదురు చెప్పడం అసలే తెలీదు. అన్నిటినీ కూడగట్టుకుని మనసే తిరగబడి —ఎదుగుతున్నవాడికి మనశ్శాంతి లేకుండా చేసింది.

స్కూలుఫైనలు చదివేనాటికి జగన్నాధం చిన్నచిన్న పనులు — వాళ్ళ వాళ్ళకి నచ్చనివీ — చేస్తేగాని తనకి శాంతి నియ్యనివీ — చెయ్యడం ప్రారంభించాడు. తన జీతానికని ఇంట్లో యిచ్చిన డబ్బులు గోపాలం అనే బీదకుర్రాడికి స్కూలు జీతం కట్టేశాడు. బజారు పనికి ఇంట్లో వేరే పనికుర్రాడు ఉంటే వాణ్ణి మానిపించేశాడు. సాయంకాలం రెగ్యులర్‌గా ప్లేగ్రౌండ్‌కి వెళ్ళడం మొదలెట్టేడు. ముసిలాళ్ళు ఇలాంటివిచూసి నెత్తీ నోరూ బాదుకున్నారు. జగన్నాధానికి జవాబు చెప్పే ధైర్యం మాత్రం లేదు. ఆ మూకీభావమే అతనికి కవచం కూడాను!

అపాయకరమైన అభిమాన బంధనాల్ని కొంచె కొంచెం చీల్చుకు చూడగలిగితే వాడికి అనేక చిత్రాలు గోచరించేవి. 'ప్రపంచం ఇంత పెద్దదా' అని వాడి పెద్ద కళ్ళు మళ్ళీ పెద్దవయేవి. ఆ రోజుల్లో ఆ స్కూలు ప్రపంచంలో వాణ్ణి ఎక్కువ ఆకర్షించింది వాళ్ళ క్లాసుమేటు కామేశం. అసలు కామేశంవైపు జగన్నాధం తేరిపార చూడటమే చిత్రమైన పరిస్థితుల్లో జరిగింది.

ఓసారి జగన్నాధం క్లాసులోకి రాగానే పదిమందితో ఏదో పెద్దగొంతుక పెట్టుకుని లెక్చరిస్తున్న కామేశం చటుక్కున ఆపేశాడు.

'ఈ కబురుమాత్రం ఆ పద్దెనిమిదేళ్ళ పాపాయితో చెప్పకండి. హడలి మంచమెక్కగలడు' అని కామేశం అంటే అందరూ జగన్నాధాన్ని చూసి నవ్వేరు. ఎందుకో తెలియకుండా తన్ని అందరూ ఏడిపించడం వాడికి చాలా బాధనిపించింది. అడిగే ధైర్యంలేక దిగులుగా ఊరుకున్నాడు. అతని అశక్తతకి జాలిపడి ఒకడు జరిగిన విషయం చెప్పేడు.

ఆ ముందు రాత్రి కామేశం ఎదురింట్లో ఎవడో కన్నం వేశాడుట. కామేశానికి మెలుకువ వచ్చి వాణ్ణి తరిమి పట్టుకున్నాడుట. వాళ్ళమ్మ నెత్తీ నోరూ బాదుకుందిట. బాబూ, మన యిల్లు కాదు వాకిలి కాదు.... నువ్వుచూస్తే కుర్రాడివి....దొంగల దగ్గిర కత్తులుంటాయి. ఎందుకురా ఇలాంటి సాహసం పనులూ ?'

'మొగాడ్ని గనక' అన్నాట్ట కామేశం.

'ఏదీ మళ్లా అలా అనూ' అన్నాట్ట వెనకనించి వాళ్ల నాన్న.

'ఒకసారి కాదు వందసార్లు అంటాను. అదికూడా అందుకే. మొగాణ్ణి కనక' ఛెళ్ళుమని ఒక్కటేశాడుట వాళ్ళ నాన్న. 'మళ్ళీ అలా అను నీ పని చెప్తాన్' అనుకుంటూ. కాని కామేశం ఆ మాట మానలేదు. ఓడిపోయింది ఆఖరికి వాళ్ల నాన్నే. కొట్టికొట్టి విసిగెత్తి వెళ్ళిపోయాడుట. వాళ్లమ్మ ఆశ్చర్యపోయిందట.

'ఎంత మొండి వాడివిరా నువ్వూ ? ఇన్ని దెబ్బలు తిన్నావ్, కళ్లమ్మట నీళ్ల చుక్కయినా రాదేంరా ?'

'మొగాడ్ని గనక' అన్నాట్ట కామేశం.

'అవును' అనుకున్నాడు జగన్నాధం.... ఏ పెద్దలు సంపాదించిన ఆస్తో వస్తే, కాలు కదపకుండా అన్నీ వచ్చి ఒళ్లోపడే అదృష్టమే కలసివస్తే, ఎదుటివారు చచ్చినా తనకి తలనొప్పితో సమానంగానైనా జమకట్టక ఇదే జీవితమూ ఇంతే సర్వమూ అనుకుని ఇవాళ పుట్టి రేపు చచ్చిపోయే అల్పజీవులూ అంతఃపుర స్త్రీలూ ఎందరు లేరు ? నిజానికి మొగాడు కనకనే ప్రక్కయింట్లో పాప పాలకేడ్చినా కామేశానికి కావలసి వచ్చింది. ఎదురింట్లో దొంగ పడినా కావలసి వచ్చింది.

కామేశం వంటిమీద చారలుచూసి అందరూ ఆశ్చర్యపడ్డారు.

'మీ నాన్నకి ఇంత మతిలేదేమిట్రా? ఇలాగే బాదుకుంటాడా?'

కామేశం గట్టిగా గర్వంగా నవ్వేడు.

'ఓస్ ఈ దెబ్బలు నాకో లెక్కట్రా! ఇవాళుంటాయ్. రేపుపోతాయ్....నాల్రోజుల పాటు నిలబడీ పనిచెయ్యాల్రా....ఎదుటి వాడికి అన్యాయం జరుగుతూంటే ఊరుకుంటే మనకీ పశువులకీ ఆట్టే తేడాలేదు... మనం మనుషలం అనిపించుకునే పనులు చెయ్యాలోయ్'.

జగన్నాధం ఒళ్ళు పులకరించింది.


'కామేశం, నన్నూ నీ జట్టులో చేర్చుకోవూ?' అని అడిగాడు. అలా అడగగల్గిన ధైర్యం వచ్చినందుకు అతనికి రోజల్లా సంతోషం కలిగింది. ఆ ధైర్యం నిలబెట్టుకోవలసిన పరీక్ష సమయంకూడా త్వరలోనే వచ్చింది.

అసలు జరిగింది యిదీ:

మంచినీళ్లు పోసే సుబ్బయ్య హఠాత్తుగా చచ్చి ఊరుకున్నాడు. ఎవరేమిస్తే అది మళ్లీ మాటాడకుండా పుచ్చుకొని—ఎవరింట్లో ఏ రాత్రివేళ ఏ సహాయం కావలసివచ్చినా ఆదరా బాదరా పరుగెత్తుకుని వచ్చి ఆదుకునే సుబ్బయ్య నాలుగు రోజుల జ్వరానికే కన్ను మూసేశాడు.

ప్రతి బ్రాహ్మణ కుటుంబంలోనూ వాడు తలలో నాలికలా చెలామణీ అవడానికి మరో కారణముంది. తెలిసినవాళ్ల ఇళ్లల్లో ఎవరి వంట్లో కాస్త వెచ్చగా ఉన్నాచాలు ఇక ఆ మంచం వదిలేవాడు కాడు. తల్లీ తోడూ కూడా అంటురోగాలని భయపడి దూరంగాపోయే రోగుల దగ్గిరకూడా వాడు నిర్భయంగా సేవ చేసేవాడు. మంచినీళ్ల సుబ్బయ్య అనేపేరు వాడికి క్రమంగా తగ్గి మంచి సుబ్బయ్య అనేపేరు నిలబడిపోయింది. ఆఖరికి ఆ మంచి నిలబడి సుబ్బయ్యే వెళ్లిపోయాడు!

ఆ సుబ్బయ్య కామేశం వాళ్లింట్లోకూడా నీళ్ళు పోసేవాడు.



"ఎంత గుండెధైర్యం, ఎవడోయ్ ఇంత పనిచేసింది?"
"వాడేసార్, మొన్న మీ నెత్తినున్న రెండెంటికలు రాలగొడతా నన్నాడే! వాడేసార్."

ఓనాడు కామేశం సుబ్బయ్య తల్లి వెంకమ్మ తనతల్లితో మాట్లాడ్డానికి రావడం చూసి ఆర్చర్యపోయాడు. ముందురోజు మధ్యాహ్నమే చెట్టంత కొడుకునూ దేవుడికి అప్పచెప్పింది వెంకమ్మ. ఇలాంటప్పుడు అందరూ వాళ్లింటికి పరామర్శకి వెళ్లడం సహజం. కాని యిదేవిఁటి? అమ్మని చూడగానే వెంకమ్మ గొల్లుమంది. ఈవిడ ఓదార్చింది.

'ఊరుకో వెంకమ్మా ఏంచేస్తావ్....ఈ ముసలితనంలో భగవంతుడు నీకిలా రాసి పెట్టాడు. మనచేతుల్లో ఏముంది?'

'అందుకుకాదు అన్నపూర్ణమ్మగారూ, ఊళ్ళో ఎవరు చచ్చిపోయారని తెలిసినా తనే నాయకత్వం వహించి శవాన్ని తీసుకెళ్లే ఏర్పాటు చేసేవాడు....పసిపిల్లల్ని పోగొట్టుకున్న తల్లి పడుచు తల్లిదండ్రుల్ని ఓదార్చి యింతింత పిల్లల్ని గుడ్డకప్పి వాడు శ్మశానానికి తీసుకెళ్లడం నాకు ఇప్పటికీ కళ్ళకు కట్టినట్టు జ్ఞాపకముంది. వాడు చేసిన అనాధప్రేత సంస్కారాలకి లెక్కాజమాలేదు...అలాంటి వాడిచేతితో వెళ్లిపోయేగీత ఈ దిక్కుమాలినదానికే లేకపోయింది....వాడికి అందరూ ఉన్నారు. వాడికే ఎవరూ లేకపోయారు! వాణ్ణి తీసుకెళ్లడానికి ఒక్కరూ రాలేదు.... ముసిల్దాన్ని నేనేం చెయ్యగలను తల్లీ!'

వెంకమ్మ మళ్ళీ వెక్కివెక్కి ఏడ్చింది. అమ్మ రెండురూపాయిలు యిచ్చింది. వెంకమ్మ వెళ్ళిపోతూంటే కామేశం వీధి మలుపులో కలుసుకున్నాడు.

'నాన్న పెన్ను కొనుక్కోమని రెండు రూపాయిలు యిచ్చాడు. వెధవ పెన్ను లేపోతే పోయింది.. పెనసలుతో రాసుకుంటాను...మేష్టారు కొడతారా....కొట్టనియ్యి-ఇంతట్లో చచ్చిపోను....ఇదిగో మామ్మా ఈ రెండూకూడా ఉంచు ఎందుకేనా పనికొస్తాయి.'

వెంకమ్మ కళ్లమ్మట గిర్రున నీళ్ళు తిరిగేయి.

'ఒద్దుబాబూ...అమ్మయిచ్చారని పుచ్చుకున్నానుగాని....నాకెందుకు యిది! నిన్న రెండింటికనగా పోయాడు....ఇప్పటి వరకూ వాడినెత్తిన యింతనిప్పు పెట్టించలేక పోయాను....ఈ వూళ్ళో మళ్ళీ, రెండొందల బ్రాహ్మణ గడప ఉంది... పైపై పరామర్శలు చేసి జారుకున్న వారేగాని ఒక్కళ్ళూ వచ్చి ఏర్పాట్లు చేసినవారు లేరు....దిక్కుమాలిన ముండని ఆడకూతుర్ని—నేనేం చెయ్యగలను కామేశం బాబూ?'

కామేశానికి అమ్మమాటలు జ్ఞాపకానికి వచ్చాయి.

'మనచేతుల్లో ఏముంది?'

కామేశం రెండుచేతులూ జాపి చూసుకున్నాడు. చొక్కా చేతుల మడతలు పైకి తీసి కండలు చూసుకున్నాడు. వాడిరక్తం ఉడుకెత్తింది ఉరకలెత్తింది.

'మన మనసులో ఏమైనా ఉంటే-మన చేతుల్లో కావలసినంత ఉంది' వాడి కళ్ళు మిలమిల మెరిశాయి.

'మామ్మా .... మునీశ్వరుడి లాంటి నీ కొడుకు శవం మునిసిపాలిటీవాళ్ళు యీడ్చే ఖర్మం యింకా యీ ఊరికి పట్టలేదు. నేనున్నాను పద....'

అప్పుడు కామేశం మొహం చూసినా ఆ నడకచూసినా ప్రపంచాన్ని ఎన్ని కోణాలలో తరచి చూసిన వాళ్లయినా సమ్మోహితులు కాక మానరు. ముందు వెంకమ్మనీ తరవాత కామేశాన్నీ చూసిన కామేశం స్నేహితులు అడక్కుండానే అంతా గ్రహించినట్టు వాణ్ణి అనుసరించారు. చలిగాలి తగులుతోందని చెవులకి మఫ్లర్ కట్టుకుని కిటికీలోంచి చూస్తున్న జగన్నాధం ఆ మఫ్లర్ విప్పి అవతల పారేశాడు. మఫ్లరేకాదు చాతకాని తనాన్నీ పిరికితనాన్నీ భయాన్నీ అన్నిటినీ విప్పి అవతల పారేశాడు. వాడు మనిషిగా— మళ్లీ మాటాడితే మనిషిగా మారింది అప్పుడే. అవును, అప్పుడే....గాఢమైన జడత్వంలో నిద్రిస్తున్న చీకటి గూడును చీల్చుకుని గొంగళిపురుగు రంగురంగుల చుక్కచుక్కల సీతాకోక చిలకగా మారి ఎగిరిపోయింది. అప్పుడే...అవును. అప్పుడే....అమావాశ్య బతుకులో అందమైన దీపావళి అప్పుడే...

ఎక్కడ వెనకబడి పోతానో అని జగన్నాధం ఒళ్ళు తెలియని ఆవేశంతో పరిగెత్తి పరిగెత్తి ఆ గుంపును చేరడమే కాకుండా కామేశం దగ్గిరగా వెళ్ళి చేతిలో చెయ్యి కలిపేడు.

ఆ సమయంలో పెద్దవాళ్ళేం దెబ్బలాడతారో అని పిల్లలకి తోచలేదు. అంతకంటే ఆశ్చర్యం ఏవిటంటే పిల్లల్ని దెబ్బలాడాలనే విషయంకూడా పెద్దవాళ్లకి జ్ఞాపకం రాలేదు. చెప్పేదేవిటంటే.

'తల్లీదండ్రీ ఉన్నవాళ్ళం.... మేం శ్మశానానికి వెళ్లకూడదు.'

'మొన్ననే జ్వరంపడి లేచాను...నాకు భయం బాబూ.'

'నాకు మయిల వచ్చింది. లేకపోతే నేను రానూ?'

'మా ఆవిడ కడుపుతో ఉంది నేను శవంమొయ్యడానికి రాకూడదట.'

ఇలాఅనేకసాకులుచెప్పి తప్పించుకున్న పెద్దవాళ్ళు సహితం 'మేం మోస్తామంటే మేం మోస్తాం' అని ముందుకువచ్చారు!

సుబ్బయ్యచావు .... దేవుడిపెళ్ళి అంత వైభవంగా జరిగింది!

ఒక కొమ్ము భుజాన్ని ఎత్తి పట్టుకుని కామేశం అన్న మాటలు జగన్నాధం జీవితంలో మరిచి పోలేనివి.

'మంచిపనులు చేద్దామని మళ్లీ పెద్ద కబుర్లు చెబుతాం...అవసరంవస్తే ఆమడ దూరానికి పారిపోతాం...అలాంటిది బతుకు కాదు, చావు. మనం చేసే మంచి పనులకి ఇదే నాంది. మన సంస్కారం ఇక్కణ్ణుంచే మొదలు పెడదాం.. మన స్నేహితులందరూ ఒకసారి ఈ పాడెను భుజాన్ని పెట్టుకోండి'

అని అందరి భుజాన్నీ అది పెట్టించాడు. అంత ఎత్తులేని పిల్లలు కనీసం ఒకసారి అట్నుంచి యిటయినా దూరేరు.

* * *

జగన్నాధం జగ్గుని మరింత దగ్గిరగా తీసుకున్నాడు.చేతులు పైకెత్తి నమస్కారం చేశాడు.

'దేవుడిపల్లకి వెళ్ళిపోయింది తాతయ్యా' అన్నాడు మనవడు ఆశ్చర్యంగా.

'లేదు...లేదు' అని తాత గొణుక్కున్నాడు. మొహమంతా నిండిన పెద్దకళ్లనూ ఆ కళ్లనిండా నిండిన వెలుగునూ చూసి జగ్గుకి ఏం బోధపడలేదు. తాతను గట్టిగా కౌగలించుకున్నాడు.

